సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



సర్వ హంగులు..

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ ఆఫీసులు ఏర్పాటు కానున్నాయి. 8లో▸



ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు



బోనాల ఊరేగింపులో కళాకారుల ప్రదర్శన

చల్లంగ చూడమ్మ.. పోచమ్మ తల్లి

కడ్తాల్ మండల పరిధిలో సోమవారం పోచమ్మ బోనాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రభల ఊరేగింపు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. పూజల్లో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

– కడ్తాల్



ఊరేగింపులో ఉత్సాహం

న్యూస్‌రీల్

మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు



శరత్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండలంలోని చెందిప్ప గ్రామంలో వెలసిన 11వ శతాబ్దపు మరకత శివాలయాన్ని సోమవారం విశ్రాంత ఐఏఎస్ శరత్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శరత్ దంపతులు లింగానికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరకత శివాలయాన్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శరత్ దంపతులకి జ్ఞాపిక, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు సదానందం, సభ్యులు హనుమంతు, అర్చకులు ప్రమోద్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించండి



విద్యాశాఖ కమిషనర్‌ను కలిసిన మొగిలిగిద్ద గ్రామస్తులు

షాద్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరుతూ సోమవారం మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామస్తులు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ కోదండరాంతో వెళ్లి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ నవీన్ నికోలస్‌ను కలిసారు. గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారని, పాఠశాల అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. పనులు నేటికీ ప్రారంభం కాలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాల నుంచి 11 మంది ఉపాధ్యాయులు డిప్యుటేషన్‌పై వెళ్తున్నారని, డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. స్పందించిన కమిషనర్ పాఠశాలను సెప్టెంబర్ 1న సందర్శిస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో శ్యాంసుందర్, దయాసాగర్, బాబు తదితరులు ఉన్నారు.

ఉప్పొంగి ప్రవహిస్తున్న ఈసీ వాగు



అమ్డాపూర్ సమీపంలో ప్రవాహం

మొయినాబాద్‌రూరల్: మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈసీ వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో వరద ప్రవాహం పెరుగుతోంది. చేవెళ్ల, షాబాద్ మండలాల మీదుగా మొయినాబాద్ మండలాన్ని తాకుతూ నక్కలపల్లి, అమ్డాపూర్, బాకారం ప్రాంతాల మీదుగా ప్రవహిస్తూ హిమాయత్ సాగర్‌లోకి చేరుతోంది. అమ్డాపూర్ సమీపంలో పంటపొలాల నుంచి జోరుగా ప్రవహిస్తోంది.

హనుమంతుడి చరిత్ర స్ఫూర్తి మంత్రం



మాట్లాడుతున్న రామానుజ జీయర్‌స్వామి

చేవెళ్ల: హనుమంతుడి చరిత్ర ప్రపంచానికి స్ఫూర్తి మంత్రమని త్రిదండి అహోబిల పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి అన్నారు. మండలంలోని తంగడపల్లిలో ఆరు రోజులుగా కొనసాగుతున్న అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠ, నాభిశిల ప్రతిష్ఠ ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు రామానుజ జీయర్ స్వామి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. హనుమంతుని గుడి లేని ఊరు ఉండదని పేర్కొన్నారు. యువత హనుమంతుడిని ఆదర్శంగా తీసుకోవాలని, దేశ రక్షణ, ధర్మ రక్షణ కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మన్‌లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మృత్యుపాశాలు!



షాబాద్: నాంధార్‌ఖాపేట్‌లో పొలంలో ఒరిగిన విద్యుత్ స్తంభం

నెత్తిన వేలాడుతున్న విద్యుత్ వైర్లు

- స్తంభాలకు ఉరితాళ్లుగా మారిన కేబుళ్లు
- లైన్ల పునరుద్ధరణ కోసం ఏటా రూ.కోట్లలో ఖర్చు
- అయినా మెరుగుపడని పంపిణీ వ్యవస్థ
- తరచూ తెగిపడుతున్న తీగలు
- చోటుచేసుకుంటున్న ప్రమాదాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వినియోగదారుల ఇళ్లలో వెలుగులు నింపాల్సిన విద్యుత్ లైన్లు.. జీవితాల్లో చీకట్లను మిగుల్చుతున్నాయి. నెత్తిన మృత్యుపాశాల్లా వేలాడుతున్న వైర్లు ఎప్పుడు.. ఎవరిపై తెగిపడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎలాంటి ఈదురు గాలులు, వర్షాలు లేకపోయినప్పటికీ వైర్లు తెగి పడుతుండటాన్ని పరిశీలిస్తే డిస్ట్రిబ్యూషన్ లైన్ల వ్యవస్థ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం డిస్కం ఏటా రూ.వంద కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. అయినా



కొందుర్గు: ముట్పూర్‌లో ట్రాక్టర్‌కు తాకే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

ప్రమాదాలు తగ్గకపోగా మరింత పెరుగుతుండటం, అమాయకులు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతుండం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ ఇంజనీర్లు మాత్రం తమ తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు భిన్న వాదనలు ముందుకు తెస్తున్నారు.

ముట్టుకుంటే షాకే..

ఇప్పటికీ ఎక్కడ చూసినా నిజాం కాలం నాటి ఓవర్ హెడ్ లైన్లు, ఇనుప స్తంభాలే దర్శనమిస్తున్నాయి. ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ లైన్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. తరచూ వైర్లు తెగిపడుతుండటంతో పాటు స్తంభాలను ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, లూజు లైన్లు సరిచేయడం, దెబ్బతిన్న పిన్ ఇన్సులేటర్లను మార్చడం, పాడైన ఫ్యూజ్ బాక్సులను మార్చడం, డీటీఆర్‌ల వద్ద పటిష్టమైన ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వంటి పనుల కోసం డిస్కం ఏటా రూ.100 కోట్లకుపైగా ఖర్చు చేస్తోంది. కంపెనీ కేటాయించిన నిధులు హారతి కర్పూరంలా కరిగిపోతున్నాయే తప్ప సరఫరా వ్యవస్థ మాత్రం మెరుగుపడటం లేదు. విద్యుత్ ప్రమాదాలు ఆగడం లేదు. గత ఏడాది జూలై నుంచి అక్టోబర్ వరకు సెక్షన్ల వారీగా టీజీ గెయిన్స్ (జీఐఎస్ అసెట్ ఇన్‌స్పెక్షన్ అండ్ మేనేజ్‌మెంట్) పేరుతో సర్వే చేయించారు. దెబ్బతిని వంగిన స్తంభాలు, కిందికి వేలాడుతున్న వైర్లు, లూజ్ కాంటాక్ట్‌లు, ఎలాంటి రక్షణ లేని డీటీఆర్‌లు, ఫ్యూజ్‌బాక్స్‌లు, రింగ్ మెయిన్ యూనిట్లు, ఏబీ స్విచ్‌లు, హెచ్‌జీ ఫ్యూజ్ బాక్స్‌లు 4.50 లక్షల వరకు ఉన్నట్లు గుర్తించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కొన్ని పనులు చేపట్టినట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ప్రమాదాల సంఖ్య మాత్రం తగ్గలేదు. పలు బస్తీల్లోని ఇరుకు గల్లీల్లో ప్రమాదకరంగా మారిన కండక్టర్‌ల స్థానంలో ఎయిర్ బంచ్ కేబుళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని నిర్ణయించినా ఇప్పటి వరకు ప్రారంభించలేదు.

ఉరి తాళ్లుగా మారిన కేబుళ్లు

ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన కండక్టర్లు, స్తంభాలు తెగిపడుతుంటే.. మరోవైపు వాటి మెడకు టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు ఉరితాళ్లుగా మారుతున్నాయి. ఏ స్తంభాన్ని పరిశీలించినా పెద్ద మొత్తంలో వైర్లు వేలాడుతూ కన్పిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా స్తంభాలకు జంక్షన్ బాక్సులను ఏర్పాటు చేయడంతో పాటు వాటికి ఇల్లీగల్‌గా కరెంట్ వాడుతున్నారు. ఇదిలా ఉంటే భారీ ఈదురు గాలులతో కూడిన వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి లైన్లపై పడుతుండటం, అటు ఇటుగా ఉన్న స్తంభాలు విరిగిపడుతున్నాయి. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలుతున్నాయి. ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తూ విద్యుత్ అంతరాయాలకు కారణమవుతున్నా ఆపరేటర్లపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

మొయినాబాద్ కమిషనర్‌పై

చర్యలు తీసుకోండి



మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన

మొయినాబాద్: జాతీయ జెండాను అవమనించేలా వ్యవహరించిన మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. అజీజ్‌నగర్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందించారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ జెండాను అవమానించే విధంగా వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. వార్డు కార్యాలయలపై ఎందుకు జెండా ఎగురవేయలేదని అడిగినందుకు దురుసుగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. ఇలాంటి అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అంజన్‌కుమార్‌గౌడ్, జిల్లా నాయకుడు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆగ్రహం!

మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌పై కలెక్టర్ నారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆర్డీఓ నివేదికను పరిశీలించిన కలెక్టర్ సోమవారం కమిషనర్‌ను తన కార్యాలయానికి పిలిపించి చీవాట్లు పెట్టినట్టు సమాచారం. ప్రజలతో ఎలా మాట్లాడాలో తెలియదా.. ఏదైనా సమస్య తలెత్తితే నచ్చజెప్పి సామరస్యంగా పరిష్కరించాల్సింది పోయి దురుసుగా ప్రవర్తించి వివాదం సృష్టిస్తావా అంటూ తీవ్ర స్థాయిలో మందలించినట్టు తెలిసింది. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర అధికారులు

ప్రజావాణి అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం మొత్తం 70 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని సంబంధిత అధికారులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండల, గ్రామస్థాయిలో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. వన మహోత్సవంలో ఆయా శాఖలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి పేమెంట్స్ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్, సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా బడి భవనం నిర్మించండి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాచారం: శిథిలావస్థ పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లి గ్రామస్తులు కోరారు. సోమవారం విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పూర్ణచందర్‌రావును నగరంలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పురాతన భవనం కావడంతో పై కప్పు పగుళ్లు ఏర్పడిందని, తరగతి గదులు కురుస్తున్నాయని తెలిపారు. భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తావునాయక్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు చందునాయక్, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయక్, నాయకులు కుమార్, జంగయ్య, రవి, గణేశ్ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల వేళ జాగ్రత్త



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

- ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్‌రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ లక్ష్మీనారాయణ సూచించారు. నవరాత్రులను పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శాంతిసంఘం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకోవాలని, మండపాల వద్ద ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా తప్పనిసరి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా వెంటనే పోలీసులకు, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. రాత్రి సమయాల్లో మండపాలవద్ద పోలీసు పహారా ఉంటుందని, పాయింట్ బుక్‌లు ఏర్పాటు చేసి పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బండారి రమేష్, గౌరవ అధ్యక్షుడు అందెబాబయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్ బాబర్, మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత, విద్యుత్ ఏడీ సత్యనారాయణ, డీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సుశీల, రాంచందర్, శరత్‌కుమార్, ప్రణయ్, శ్రీకాంత్, ఎంవీఐ వాసు, ఫైర్ అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ మార్గం అనుసరణీయం

- కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణగడ్డపై తిరుబాటు బావుటా ఎగురవేసింది సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని, ఆయన మార్గంలో నేటి యువత నడుచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి పేర్కొన్నారు. సర్దార్‌సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లోని వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు హాజరయ్యారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజన రాజ్యస్థాపనకు పాపన్నగౌడ్ చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, డీఆర్‌ఓ సంగీత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశురాం, బీసీ ఫ్రంట్ నాయకులు మల్లేష్, సుధాకర్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు
- రాష్ట్రస్థాయి అండర్–15 వాలీబాల్ టోర్నీ షురూ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఈఓ సుశీందర్‌రావు

ఇబ్రహీంపట్నం: అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్–15 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక వికాసానికి దోహదం చేస్తాయని అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని, మేధో సంపత్తిని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభాపాటవాలు చాటాలని, క్రీడల్లో రాణించి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించే విద్యార్థులను పీఈటీలు, పీడీలు ప్రోత్సహించి, వారికి మంచి అవకాశాలు దక్కేలా తమవంతు కృషి చేయాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 25న పుణేలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని వెల్లడించారు. పోటీలకు ములుగు జిల్లా మినహా 32 జిల్లాల నుంచి సుమారు 700 మంది వాలీబాల్ క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో గురుకుల విద్యాపీఠల్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, మండల విద్యాధికారి హర్యానాయక్, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, పీడీ, పీఈటీల సెక్రటరీ ఎండీ షబ్బీర్, క్రీడల అబ్జర్వర్ వెంకట్‌నారాయణ, జోనల్ సెక్రటరీ పీడీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

దేవాదాయ ధర్మాదాయశాఖ
ఈఓ శ్రీనివాస్


పూజా కార్యక్రమంలో భక్తజనం

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవాదాయ ధర్మాదాయశాఖ ఈఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల పరిధి కొమరబండ గ్రామంలో శ్రీ బుగ్గరామేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా శివపార్వతులకు కల్యాణం, అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతా మూర్తుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. కార్యక్రమలో ఆలయ చైర్మన్ వెంకటయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, సభ్యులు సత్యనారాయణ, రాణిమ్మ, సునీత, మాజీ సర్పంచ్‌లు చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, నాయకులు రంగదాసు, నర్సింహ్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, అంజయ్య, సత్తయ్యగౌడ్, కుమార్, నరేష్, వెంకటేశ్, నర్సింహులు, బాలరాజ్, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే భూ ధారాదత్తం


మాట్లాడుతున్న సోషలిస్ట్ పార్టీ నాయకులు

సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం

బడంగ్‌పేట్: పేదలు సాగుచేసుకుంటున్న భూములను గత ప్రభుత్వం లాక్కొని.. రాజకీయ లబ్ధి కోసం, ఓట్ల కోసం క్రైస్తవులకు ధారాదత్తం చేసిందని సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా యునైటెడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బొద్రమోని పురుషోత్తం ఆరోపించారు. సోమవారం కార్పొరేషన్ పరిధి కుర్మల్‌గూడలో జి.కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల భూములను నాటి బీఆర్‌ఎస్ సర్కార్ బలవంతంగా గుంజుకుందని విమర్శించారు. కుర్మల్‌గూడలో ఇళ్లులేని ఎంతో మంది పేదలు ఉన్నారని, వారికి 60 గజాలు కేటాయించడానికి మనస్సు రాని బీఆర్‌ఎస్.. క్రైస్తవుల మెప్పు పొందడానికి వారి సమాధులకు ఎకరాల కొద్దీ స్థలాన్ని ఎలా కేటాయించిందని ప్రశ్నించారు. ఆ భూములను కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుజాత, నాగేంద్రమ్మ, భానుప్రసాద్, ఆర్.ఝాన్సీ, రాజు, ఎం.అరుణ, జి.జగదాంబ, పి.జ్యోతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న
మున్సిపల్ కమిషనర్ యోగేశ్

శంకర్‌పల్లి: వినాయక మండపాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు గార్డెన్స్‌లో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గణేశ్ పండగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించుకోవాలని, డీజేలకు ఎలాంటి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి సౌండ్ సిస్టం పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్, ఎస్సైలు సురేశ్, దేవేందర్, శ్రీశైలం, బేతప్ప పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

ఇబ్రహీంపట్నం: చెక్ బౌన్స్ కేసులో నిందితుడైన భాస్కర్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఇబ్రహీంపట్నం ఎంఎం కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువర్చారు. న్యాయవాది రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు దయానంద్‌కు రూ.24,87,500 చెల్లించాలని, అలాగే భాస్కర్ ఏడాది జైలు శిక్ష అనుభవించాలని తీర్పు చెప్పారన్నారు.

శంకర్‌పల్లి ఎంపీడీఓ భార్య ఆత్మహత్య

లాలాపేట: శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య గౌడ్ భార్య ఉష(37) ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ భార్య, ఇద్దరు కూతుళ్లతో కలిసి హబ్సిగూడ స్ట్రీట్ నంబర్ 4లోని హోమ్ సన్‌షైన్ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో కొద్ది రోజులుగా మానసిక వేదన అనుభవిస్తున్న ఉష.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. ఓ వివాహానికి హాజరయ్యేందుకు వెళ్లిన వెంకయ్యగౌడ్ ఇంటికి వచ్చి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. అపార్ట్‌మెంట్ వాచ్‌మన్ సహాయంతో తలుపులు బద్దలు కొట్టి, కిందకు దించగా అప్పటికే చనిపోయింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు బాడీని గాంధీ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చీటింగ్ కేసులో పలువురికి జైలు

ఇబ్రహీంపట్నం రూరల్: మంగల్‌పల్లి రెవెన్యూ పరిధిలో ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెప్పి, మోసం చేసిన కేసులో పలువురికి జైలు శిక్ష విధిస్తూ సోమవారం న్యాయస్థానం తీర్పు వెల్లడించింది. దోషులుగా తేలిన బాలాజీ, అమృతమ్మ, ఆర్.శంకర్‌నాయక్, ఎం.రాజ్‌గోపత్‌తో పాటు మరో ఇద్దరుకి మూడేళ్ల జైలుతో పాటు జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం కోర్టు న్యాయమూర్తి యశ్వంత్‌సింగ్ తీర్పు వెల్లడించారు.

సర్వ హంగులు.. సకల సౌకర్యాలు

- గ్రేటర్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ సబ్–రిజిస్ట్రార్ ఆఫీసులు
- కార్పొరేట్ స్థాయిలో భవన సముదాయాలు
- 11 సమీకృత భవనాల్లో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- 20న గచ్చిబౌలిలో సీఎం చేతులు మీదుగా శంకుస్థాపన



సాక్షి,రంగారెడ్డి: స్థిరాస్తి రిజిస్ట్రేషన్ల కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా, పరిపాలనకు ఇబ్బంది లేకుండా ఇంటిగ్రేటెడ్ సబ్–రిజిస్ట్రార్ ఆఫీసుల ఏర్పాటుకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ చర్యలకు ఉపక్రమించింది. గ్రేటర్ పరిధిలో అవసరమైన ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరించి సమీకృత భవన సముదాయాలు నిర్మించాలని నిర్ణయించింది.

11 సమీకృత భవన సముదాయాలు..

గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి నాలుగు జిల్లాల పరిధిలోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 సమీకృత భవనాల పరిధిలోకి తీసుకొచ్చేందుకు స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ చర్యలు చేట్టింది. తొలివిడతలో రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ సబ్–రిజిస్ట్రార్ భవన సముదాయాన్ని నిర్మించనుంది. అందులో రంగారెడ్డి ఆర్వో ఆఫీస్, గండిపేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ కార్యాలయాల కార్యాకలాపాలు నిర్వహించే విధంగా ఏర్పాటు చేస్తోంది. ఈ ఇంటిగ్రేటెడ్ సబ్–రిజిస్ట్రార్ ఆఫీసుల భవన సముదాయానికి ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగే విధంగా రంగం సిద్ధం చేసింది.

ఇంకా ఎక్కడెక్కడ నిర్మిస్తారంటే..

- నగర శివారులోని కోహెడలో అబ్దుల్లాపూర్, పెద్ద అంబర్ పేట్, హయత్‌నగర్, వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని నిర్మించనున్నారు.
- మంకాల్‌లో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల కోసం..
- బోడుప్పల్ లో ఆర్వో మేడ్చల్, కుత్బుల్లాపూర్, కీసర, శామీర్‌పేట్ కార్యాలయాల కోసం
- కండ్లకోయలో ఉప్పల్, నారపల్లి, కాప్రా, ఘట్‌కేసర్, మల్కాజ్‌గిరికి..
- బంజారాహిల్స్‌లో బంజారాహిల్స్, ఎస్.ఆర్. నగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల కోసం..
- మలక్‌పేటలో ఆజంపూరా, చార్మినార్, దూద్‌బౌలి సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు పనిచేసే విధంగా ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాలను నిర్మించాలని నిర్ణయించింది.
- మరో పదమూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం నాలుగు చోట్ల ఇంటిగ్రేటెడ్ భవనాల కోసం స్థలాలను గుర్తింపు కోసం రిజిస్ట్రేషన్‌శాఖ అధికారులు జిల్లా కలెక్టర్లకు లేఖ రాసినట్లు తెలుస్తోంది.

డిఫాల్టర్లను వదిలేసి.. మాపై పడతారా!


సహకార బ్యాంకు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

- చిన్న సన్నకారు రైతుల మండిపాటు
- సంఘం అధికారులు వేధిస్తున్నారంటూ ఆందోళన

అబ్దుల్లాపూర్‌మెట్: రైతుల ముసుగులో కొందరు రైతుసేవా సహకార సంఘం నుంచి అధిక మొత్తంలో రుణాలు పొంది, చెల్లించడం లేదని.. డిఫాల్టర్లు చెల్లిస్తేనే తాము చెల్లిస్తామని రైతులు స్పష్టం చేశారు. రుణాలను త్వరగా చెల్లించాలని సంఘం అధికారులు, సిబ్బంది ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ.. సోమవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయం ఎదుట మజీద్‌పూర్ గ్రామ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సాగు చేయని వారికి పెద్దమొత్తంలో రుణాలు ఇచ్చి, వసూలు చేయకుండా కాలం గడుపుతున్నారని, చిన్నమొత్తం రుణంగా ఇచ్చి చిన్న సన్నకారు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రుణాలు మంజూరు చేసి, డబ్బులు ఇవ్వకుండా కొందరు రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. కొంత మంది 200 గజాల ప్లాటు తప్పుడు పత్రాలు పెట్టి, బ్యాంకులో రుణాలు పొందారని పేర్కొన్నారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకొని, రుణాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రుణాలు పొంది సాగు చేయకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి, రూ. కోట్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలుత అలాంటి వారి నుంచి రుణం వసూలు చేయాలని సూచించారు.

డబ్బులివ్వలేదని కిడ్నాప్ చేశారు!

- బండ్లగూడలో దారుణం
- కుటుంబ సభ్యులకు వీడియోకాల్ చేసి బెదిరింపులు

చాంద్రాయణగుట్ట: హిజ్రాలతో జత కట్టిన రౌడీషీటర్లు ఓ వ్యక్తిని బండ్లగూడలో కిడ్నాప్ చేసి జల్‌పల్లిలో నిర్బంధించారు. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు...శ్రీరాం కాలనీ శివాజీ విగ్రహ సమీపంలోని ఓ ఇంటిని కొన్నాళ్లుగా హిజ్రాలు అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నారు. వీరికి చాంద్రాయణగుట్టకు చెందిన ఆటోడ్రైవర్ సమీర్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలోనే రౌడీషీటర్‌లైన ఆమేర్, ఉమర్‌లు కూడా వీరితో కలిసి తరచూ పార్టీలు జరుపుకుంటుంటారు. ఆదివారం అర్ధరాత్రి కొంతమంది మైనర్లతో కలిసి వీరు బండ్లగూడ నూరీనగర్ మీదుగా వెళుతున్న షేక్ షా వలీ అనే యువకుడిని డబ్బు డిమాండ్ చేశారు. తన వద్ద లేవని అతడు వెల్లడించడంతో కిడ్నాప్ చేసి కాటేదాన్ పరిసరాలలో తిప్పుతూ శ్రీరాం కాలనీలోని హిజ్రాల నివాసానికి తీసుకెళ్లి నిర్బంధించారు. రౌడీషీటర్ బాధితుడి కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేసి తీవ్రంగా బెదిరించాడు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు ఉదయాన్నే శ్రీరాం కాలనీకి వెళ్లి బాధితుడిని విడిపించి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గంజాయి మత్తులో ఉన్న నిందితులు అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసుల పైకి ఎదురు తిరుగడంతో శ్రీరాం కాలనీ వాసులు భయాందోళనలకు గురయ్యారు. ఈ ఘ టనపై మంగళవారం పోలీసులు మీడియా స మావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

వరద నీటి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: దుర్గానగర్ చౌరస్తాలో వరద నీటి కాలువలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభించింది. ఈ ఘటన సోమవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు తెలిపిన మేరకు.. దుర్గానగర్ చౌరస్తా వద్ద వరద నీటి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి మృతదేహాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల ప్రతిభకు ప్రశంసాపత్రాలు

సాక్షి, సిటీ బ్యూరో: ప్రభుత్వ పాఠశాలలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రం తో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులను జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అందజేశారు. సోమవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు, ఇంటర్మీడియట్‌లో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలకు ప్రశంసా పత్రాలతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతులు కింద పదివేలు చొప్పున జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవాన్ పలని, జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి పాల్గొన్నారు.

చోరీ కేసును రెండు గంటల్లోనే ఛేదించిన పోలీసులు

సనత్‌నగర్: పనిచేస్తున్న ఇంట్లోనే చోరీకి పాల్పడిన వ్యక్తిని బేగంపేట పోలీసులు రెండు గంటల్లోనే అరెస్టు చేశారు. డీఐ శ్రీనివాస్ తెలిపిన మేరకు.. బేగంపేట పైగా కాలనీలో నివాసం ఉంటున్న సాలిక్‌ఖాన్ ఈ నెల 13న కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తిరిగి మరుసటి రోజు ఇంటికి చేరుకుని చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం కనిపించింది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువా తలుపులు బలవంతంగా తెరిచినట్లున్నాయి. బీరువాలో దాచిన రూ.2 లక్షల నగదు కనిపించలేదు. దీంతో సాలిక్‌ఖాన్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే సాలిక్‌ఖాన్ ఇంట్లో పనిచేస్తున్న వికారాబాద్‌కు చెందిన రమేష్ (32) ఈ చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. గతంలో ఓ సారి ఇంట్లో చోరీకి పాల్పడి రమేష్ జైలుకు వెళ్లి వచ్చాడు. అయితే మళ్లీ అతనినే యజమానులు తమకు చెందిన ఫాంహౌస్‌లో పనికి పెట్టుకున్నారు. యజమానులు ఇంట్లో లేని సమయంలో రమేష్ మరోసారి చోరీకి పాల్పడ్డాడు. దొంగిలించిన నగదుతో ముంబాయికి పారిపోతుండగా సీసీ ఫుటేజీ, సెల్‌సిగ్నల్స్ ఆధారంగా రమేష్‌ను పట్టుకుని అతని వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

అడ్డుగా ఉన్నాడని భర్తను అంతం చేసింది

- ప్రియుడితో కలిసి భార్య కుట్ర
- నిందితుల అరెస్ట్

మోతీనగర్: ప్రియుడుతో కలిసి భర్తను హత్య చేసిన సంఘటనలో భార్య, ప్రియుడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి, ఎస్‌ఐ మహ్మద్ మజీద్ ఆలీలు తెలిపిన మేరకు.. రాజీవ్‌గాంధీ నగర్‌లో మహమ్మద్ షాదుల్, భార్య తబ్‌సుమ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కూతురు. నాలుగు సంవత్సరాల క్రితం తబ్‌సుమ్‌కు మొహమ్మద్ తాఫిక్ అనే వ్యక్తితో అయిన పరిచయం వివాహేతరసంబంధానికి దారితీసింది. ఈ విషయం భర్తకు తెలిసి మందలించాడు. దీంతో భర్త షాదుల్ అడ్డువస్తున్నాడని భావించిన భార్య.. ప్రియుడు మొహమ్మద్ తాఫిక్‌తో కలిసి షాదుల్‌ను చంపాలని నిర్ణయించుకున్నారు. ముందుగా వేసుకున్న పథకం తబ్‌సుమ్ ప్రియుడితో కలిసి ఆగస్టు 15న ఉదయం షాదుల్ పడుకున్న సమయంలో ఇద్దరూ కలిసి కొట్టి, దిండుతో ముక్కు, నోరు మూసి చంపారు. ఈ సంఘటపై స్థానికుల సమాచారం మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితులైన తబ్‌సుం, ప్రియుడు మొహమ్మద్ తాఫిక్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రాచకాలువను పునరుద్ధరిస్తాం

ఎల్‌బీనగర్: రాచకాలువను ఆక్రమించిన వారిని ఉపేక్షించేదిలేదని, కాలువను పునరుద్ధరిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి బృందావన్ మెడోస్‌కాలనీలో కాలనీవాసుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజీ, 36 ఫీట్ల రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు చేపట్టాలని, పనులను రెండు మూడు రోజుల్లో ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం జక్కిడి రామస్వామికాలనీని పరిశీలించి వరదకాలువ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు.

నటుడు ధర్మమహేశ్‌పై వేధింపుల కేసు నమోదు

రాయదుర్గం: ఓ సినిమా హీరోపై భార్య ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి మహిళా పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. సింధూరం, డ్రింకర్ సాయి సినిమాలలో హీరోగా నటించిన ధర్మామహేష్ అలియాస్ కాకాని ధర్మసత్య సాయిశ్రీనివాస మహేశ్(30) మాదాపూర్ ఫార్చ్యూన్ టవర్స్‌లో నివాసం ఉంటున్నాడు. సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్ చిరుమామిళ్ళ గౌతమి(31)ని 2019లో వివాహం చేసుకున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అతను భార్యను వేధింపులకు గురిచేయసాగాడు. అదనపు కట్నం కావాలంటూ అతని కుటుంబ సభ్యులు వేధించారు.

ఘనంగా కుంకుమార్చన

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చనువెల్లి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం అన్నారు. సంగమేశ్వర దేవాలయంలో సోమవారం ఘనంగా కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివలింగానికి అర్చన చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, లక్ష్మీపతియాదవ్, పద్మనాభం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. – మొయినాబాద్ రూరల్


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఫాగింగ్.. పరేషాన్!

- దోమకాటుకు పల్లెలు విలవిల
- మూలనపడిన యంత్రాలు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


ఈర్లపల్లిలో నిరుపయోగంగా ఫాగింగ్ మిషన్


దౌల్తాబాద్‌లో ఇళ్ల మధ్య చెట్లపొదలు

దౌల్తాబాద్: దోమకాటుతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణకు గత ప్రభుత్వ హయాంలో వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఫాగింగ్ మిషన్లు చాలా పంచాయతీల్లో చెడిపోగా.. మరికొన్నింటిలో మిషన్లు మాయమయ్యాయి. దోమకాటుకు పల్లెవాసులు విలవిలలాడుతున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్‌తో పాటు ఇతర వైరల్ జ్వరాలు తాండవం చేస్తున్నాయి. దోమల నివారణకు కొనుగోలు చేసిన యంత్రాలు పంచాయతీల్లో లేకపోవడం గమనార్హం. అప్పటి ప్రభుత్వం ఒక్కో యంత్రానికి రూ.35వేల నుంచి రూ.40వేలు వెచ్చించి కొనుగోలు చేసింది. కొన్ని గ్రామాల్లో మేజర్ పంచాయతీల నుంచి అడపాదడపా తీసుకుని పారిశుద్ధ్య కార్మికులు ఫాగింగ్ చేస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో యంత్రాలు మాయం కావడంతో పక్కన పంచాయతీల నుంచి తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇటీవల స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించాలని అధికారులు సూచనలు చేస్తున్నప్పటికీ పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. డీజిల్, పెట్రోలు, లిక్విడ్‌లను సమ పద్ధతుల్లో వినియోగించకపోవడంతో యంత్రాలు చెడిపోయినట్లు తెలుస్తోంది.

ఖర్చు తడిసి మోపెడు

మండలంలోని చాలా గ్రామాల్లో ఫాగింగ్ యంత్రాలు మరమ్మతులు చేయించలేక మూలన పడేశారు. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ కార్యదర్శులు పేర్కొంటున్నారు. చెడిపోయిన యంత్రాలకు మరమ్మతులు చేయించాలంటే చాలా ఖర్చులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదేశాలు జారీ చేశాం

ప్రతి గ్రామంలో దోమల నివారణ కోసం మందును పిచికారీ చేయాలని కార్యదర్శులకు సూచనలు చేశాం. కొన్ని గ్రామాల్లో ఫాగింగ్ మిషన్లు పాడైనట్లు తెలిసింది. వాటిని మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం. వ్యాధుల తీవ్రత దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణకు నిరంతరం పర్యవేక్షించేలా కృషి చేస్తాం. – శ్రీనివాస్, ఎంపీడీఓ, దౌల్తాబాద్

దోమల స్వైరవిహారం

గ్రామ పంచాయతీల్లో వారంలో రెండుసార్లు ఫాగింగ్ చేపట్టాల్సి ఉంటుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభంలో వీటి వినియోగం మరింత ఎక్కువ చేసినప్పుడే దోమలను సగం వరకు నియంత్రణ చేయవచ్చు. గ్రామం మొత్తంగా నెలలో ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదు. ఒకసారి పిచికారీ చేసిన ఫొటోలనే ప్రతి నెలా వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.